

నిష్పక్షపాత వార్తల నిలయం

22ND ANNIVERSARY 2004-2026

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక



బుధవారం 06-08-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 119 రూ॥ 6.00


## ఒక్క కాల్... 18 సేవలు!

**దయల్-112ను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్**



హైదరాబాద్, నేటిధాత్రి:

తెలంగాణలో అత్యవసర సేవలను మరింత వేగవంతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం డయల్--112 సేవలను ప్రారంభించింది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ బుధవారం హైదరాబాద్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఈ సేవలను ప్రారంభించారు. పోలీస్, ఫైర్, అంబులెన్స్‌తో పాటు మొత్తం 18 రకాల అత్యవసర సేవలు ఇకపై ఒకే నంబర్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండనున్నాయి. 112కు వచ్చిన ప్రతి కాల్‌పై వెంటనే స్పందించేలా అత్యాధునిక సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. కాలర్ లొకేషన్‌ను గుర్తించి సమీపంలోని సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేసే విధంగా వ్యవస్థ పనిచేస్తుందని చెప్పారు. భవిష్యత్‌లో డ్రోన్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను కూడా డయల్--112తో అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన అందించడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ!

**నకిలీ ఫైర్ ఎన్‌వోసీలతో ఇంటర్ బోర్డుకు పత్రాలు..**

**8 ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్యలకు ఆదేశాలు**




హైదరాబాద్, నేటిధాత్రి :

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌వోసీలు) సృష్టించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ నకిలీ పత్రాలను ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించి గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. విచారణలో హైడ్రా పేరును దుర్వినియోగం చేసినట్లు తేలడంతో 8 ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ వ్యవహారంపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఫోర్జరీ, నకిలీ పత్రాల తయారీ, మోసం తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్‌నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతాలకు చెందిన కళాశాలల యాజమాన్యాలు ఈ అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఆయా కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు అధికారులు నివేదించారు.

ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేట్ కళాశాలల ఫైర్ ఎన్‌వోసీలను కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడించాయి.

## ఎట్టకేలకు దిగివచ్చిన మెటా

- ప్రధాని మోదీకి జుకర్‌బర్గ్ బహిరంగ క్షమాపణలు
- వీడియో తొలగింపుపై వెనక్కి తగ్గిన సంస్థ.. కంటెంట్ బూస్టింగ్‌కు డబ్బులు తీసుకున్నామని అంగీకారం

న్యూఢిల్లీ, నేటిధాత్రి :

ప్రధాని నరేంద్ర మోదీ వీడియో తొలగింపు వివాదంలో మెటా ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్

02లో



# తుమ్మిడిహెట్టి పెంపునకు ఒత్తిడి తెండి

## మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి



- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ వినతి
- అటవీ, పర్యావరణ అనుమతులపై భూపేందర్ యాదవ్‌తో చర్చ
- ప్రధాని మోదీని తిడితే కేసు పెట్టామని వెల్లడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. 150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపే ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు.

కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. పాలమూరు--రంగారెడ్డి, సీతమ్మసాగర్, ఎస్ఆర్‌వీఎస్‌పీ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు.

ఇకపోతే ప్రధాని మోదీని తిడితే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. బీజేపీ నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' అని, విద్యార్థులను అంతకంటే ఎక్కువగా దూషించారని పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు కుట్ర!




- జీఆర్ఎంబీ అజెండాలో ఏడు ప్రాజెక్టుల సమీక్ష.. ఏపీకి అనుకూలంగా నిర్ణయాల యత్నం
- 18న కీలక సమావేశం.. ప్రభుత్వం ఎందుకు మౌనం?

**తెలంగాణ జలహక్కులను కాపాడాలని హరీశ్‌రావు డిమాండ్**

హైదరాబాద్, నేటిధాత్రి:

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని చట్టబద్ధ అనుమతులు పొందిన ఏడు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను తిరిగి సమీక్షించి రద్దు చేసే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) ఈ నెల 18న నిర్వహించనున్న సమావేశం అజెండాలో తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల సమీక్ష అంశాన్ని చేర్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**అనుమతులు రద్దు చేయడం దేశంలో ఎక్కడా జరగలేదు**

అన్ని అనుమతులు పొంది అమల్లో ఉన్న ప్రాజెక్టులను తిరిగి సమీక్షించి రద్దు చేయడం దేశ చరిత్రలో ఎక్కడా జరగలేదని హరీశ్‌రావు అన్నారు.

02లో




02లో

## హైడ్రా చీఫ్ రంగనాథ్‌తో రమ్యారావు భేటీ

**తాజా పరిణామాలపై సుదీర్ఘ చర్చ.. అక్రమాలపై కఠిన చర్యలను అభినందించిన టీపీసీసీ సీనియర్ నేత**



# "ఖాకీ"లోనూ పురుషాధిక్యమేనా?




- పోలీసు సంఘం అధ్యక్ష పదవికి మహిళలకు అవకాశం లేదా..?
- ఈసారి మహిళా అభ్యర్థిని బరిలోకి దించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

# మహిళలకు అధ్యక్ష పదవి ఎప్పుడు?

- బైలా ఉల్లంఘనలపై పోలీసు వర్గాల్లో చర్చ

వరంగల్, నేటిధాత్రి:

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. డీజీపీ ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో యూనిట్ స్థాయి ఎన్నికలు నిర్వహించి, ఎన్నికైన ప్రతినిధుల జాబితాను ఆగస్టు 10లోపు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఈ ఎన్నికల్లో కమిషనరేట్ యూనిట్‌కు అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఖజానాదారు, ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకోనున్నారు. కార్యవర్గ సభ్యులలో ఒక స్థానం మహిళా పోలీసులకు రిజర్వు చేశారు.

### ఎన్నికలు ఎలా జరుగుతాయి..?

పోలీస్ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల విషయంలో ప్రతి పోలీస్ స్టేషన్ లేదా సర్కిల్‌ను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. 50 మంది వరకు ఒక ప్రతినిధిని, 50 మందికి మించి ఉంటే ఇద్దరు ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఏఆర్ విభాగంలో కూడా ఇదే విధానం అమలులో ఉంటుంది. ఏఎస్ఐలు, ఎస్ఐలకు ప్రతి సబ్‌డివిజన్ నుంచి ఒక ప్రతినిధిని, ఇన్‌స్పెక్టర్లకు మొత్తం కమిషనరేట్‌ను ఒకే యూనిట్‌గా పరిగణించి ఒక ప్రతినిధిని ఎన్నుకుంటారు. మహిళా పోలీసులను ప్రత్యేక యూనిట్‌గా గుర్తించి ప్రతి 40 మంది మహిళా సిబ్బందికి ఒక మహిళా ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం కల్పించారు.

### అధ్యక్ష పదవికి మహిళకు అవకాశం ఎందుకు ఉండకూడదు?

బైలాలో మహిళా ప్రతినిధుల ఎన్నికకు అవకాశం కల్పించినప్పటికీ, సంఘం అధ్యక్ష పదవికి ఇప్పటివరకు మహిళలు అవకాశం పొందలేదనే చర్చ పోలీసు వర్గాల్లో సాగుతోంది. ప్రస్తుతం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు మహిళా పోలీస్ కమిషనర్ ఉండటంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలక ప్రభుత్వ పదవుల్లో మహిళలు బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఈసారి మహిళా పోలీసు అధికారిని అధ్యక్ష పదవికి పోటీ చేసేలా ప్రోత్సహించాలని మహిళా సిబ్బంది కోరుతున్నట్లు తెలుస్తోంది.

### బైలా అమలుపై సందేహాలు

ఇదిలా ఉండగా, యూనిట్ స్థాయి ఎన్నికల్లో బైలా నిబంధనల అమలుపై కూడా పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొందరు అధికారులు ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకుంటున్నారనే, బైలా నిబంధనలకు విరుద్ధంగా ఓటింగ్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశాలపై ఎన్నికల నిర్వహణ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా పోలీస్ కమిషనర్ పర్యవేక్షణ ఉండాలని పలువురు కోరుతున్నారు.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు కుట్ర!

●జీఆర్ఎంబీ అజెండాలో ఏడు ప్రాజెక్టుల సమీక్ష..ఏపీకి అనుకూలంగా నిర్ణయాల యత్నం

●18న కీలక సమావేశం.. ప్రభుత్వం ఎందుకు మౌనం?_ తెలంగాణ జలహక్కులను కాపాడాలని హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, నేటిధాత్రి:

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని చట్టబద్ధ అనుమతులు పొందిన ఏడు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను తిరిగి సమీక్షించి రద్దు చేసే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) ఈ నెల 18న నిర్వహించనున్న సమావేశం అజెండాలో తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల సమీక్ష అంశాన్ని చేర్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



### అనుమతులు రద్దు చేయడం దేశంలో ఎక్కడా జరగలేదు

అన్ని అనుమతులు పొంది అమల్లో ఉన్న ప్రాజెక్టులను తిరిగి సమీక్షించి రద్దు చేయడం దేశ చరిత్రలో ఎక్కడా జరగలేదని హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం, సీతారామతో పాటు మొత్తం ఏడు ప్రాజెక్టులకు గతంలో కేంద్ర సంస్థల నుంచి వచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించగా, జీఆర్ఎంబీ దానిని అజెండాలో చేర్చడం ఆందోళనకరమన్నారు. తెలంగాణకు చట్టబద్ధంగా లభించిన హక్కులను హరించే ప్రయత్నమిదని విమర్శించారు.

### 18న సమావేశం.. ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?

జీఆర్ఎంబీ సమావేశానికి ఇంకా కొద్ది రోజులే మిగిలి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అజెండా విడుదలై వారం రోజులు గడిచినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, తెలంగాణ ప్రతినిధులు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ ఇంజినీర్లు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లలేదా? లేక చెప్పినా పట్టించుకోలేదా? అని ప్రశ్నించారు.

### ఏపీకి అనుకూలంగా జీఆర్ఎంబీ వ్యవహారం

ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలకే అనుగుణంగా జీఆర్ఎంబీ వ్యవహరిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నప్పటికీ, ఇటీవల కేంద్రానికి లేఖ రాసి తెలంగాణ ప్రాజెక్టులను నిలిపివేయాలని కోరారని గుర్తు చేశారు. తెలంగాణ నీటి హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీకి తాకట్టు పెడుతోందా? అని ప్రశ్నించారు.

### సమ్మక్కసాగర్ సహా పలు ప్రాజెక్టులకు ముప్పు

బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర అనుమతులు సాధించిందని, ఇప్పుడు అదే ప్రాజెక్టు అనుమతులను రద్దు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. పాలమూరు--రంగారెడ్డి, సమ్మక్కసాగర్, వార్ధా తదితర ప్రాజెక్టుల డీపీఆర్‌లు తిరిగి పంపించబడుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాలేదని విమర్శించారు.

### 960 టీఎంసీల హక్కులను కాపాడాలి

గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల వాటా ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు దెబ్బతింటున్నా ప్రభుత్వం మౌనంగా ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల అనుమతులు రద్దయితే సగం తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని పేర్కొన్నారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని, దీనిపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

### మరో ఉద్యమానికి సిద్ధం

జీఆర్ఎంబీ అజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను వెంటనే తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఎలాంటి నిర్ణయాన్నీ సహించబోమని, అవసరమైతే తెలంగాణ జలహక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి బీఆర్ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాలని ఆయన కోరారు.

# ఎట్టకేలకు దిగివచ్చిన మెటా



●ప్రధాని మోదీకి జుకర్‌బర్గ్ బహిరంగ క్షమాపణలు

●వీడియో తొలగింపుపై వెనక్కి తగ్గిన సంస్థ.. కంటెంట్ బూస్టింగ్‌కు డబ్బులు తీసుకున్నామని అంగీకారం

న్యూఢిల్లీ, నేటిధాత్రి :

ప్రధాని నరేంద్ర మోదీ వీడియో తొలగింపు వివాదంలో మెటా ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు తెలిపారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన సంస్థ, కొన్ని రకాల కంటెంట్‌కు బూస్ట్ ఇవ్వడానికి డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించింది. పార్లమెంటరీ కమిటీ ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి నేపథ్యంలో మెటా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ప్రధాని మోదీకి సంబంధించిన జూలై 23 వీడియో తొలగింపుపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేంద్రం స్పష్టం చేయగా, మెటా ప్రతినిధులు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ప్రముఖుల ధృవీకరించిన ఖాతాల భద్రత, పోస్టుల తొలగింపు విధానం, డీప్‌ఫేక్‌లు, చిన్నారులపై అభ్యంతరకర కంటెంట్ నియంత్రణ తదితర అంశాలపై కేంద్రం వివరణ కోరింది.

పార్లమెంటరీ కమిటీ జారీ చేసిన గడువు ముగిసేలోపే మెటా క్షమాపణలు చెప్పడంతో పాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. భారత చట్టాలను కచ్చితంగా పాటించాలని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది.

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

బడ్జెట్‌లో కేవలం 5.98% కేటాయింపు..

కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ మండిపాటు




హైదరాబాద్, నేటిధాత్రి :

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 5.98 శాతం నిధులు మాత్రమే కేటాయించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. గత కొన్ని సంవత్సరాల్లో విద్యారంగానికి ఇంత తక్కువ కేటాయింపులు ఇదే తొలిసారని అన్నారు.

విద్యాశాఖను ముఖ్యమంత్రి వద్దే ఉంచుకుని కూడా తగిన నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని, నిధుల కొరతతో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యాలయాలు మౌలిక వసతుల సమస్యలు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. వెంటనే విద్యారంగానికి నిధులు పెంచాలని, లేకపోతే విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# హైడ్రా చీఫ్ రంగనాథ్‌తో రమ్యరావు భేటీ

తాజా పరిణామాలపై సుదీర్ఘ చర్చ.. అక్రమాలపై కఠిన చర్యలను అభినందించిన టీపీసీసీ సీనియర్ నేత



హైదరాబాద్, నేటిధాత్రి :

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ను టీపీసీసీ సీనియర్ నాయకురాలు రమ్యరావు బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా పరిణామాలు, హైడ్రా చేపడుతున్న చర్యలపై ఇరువురి మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు తెలిపారు. భూ ఆక్రమణలపై హైడ్రా చేపడుతున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని రమ్యరావు పేర్కొన్నారు. అక్రమ భూ కబ్జాదారులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కఠినంగా వ్యవహరిస్తున్న తీరును ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో హైడ్రా మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. సమావేశం ముగింపులో హైడ్రా బృందం చేపడుతున్న చర్యలకు ఆమె తన పూర్తి మద్దతు ప్రకటించారు.

# పాము కాటుతో మహిళ మృతి



పరకాల, నేటిధాత్రి:

పరకాల పట్టణంలోని మల్లారెడ్డిపల్లి బుడగ జంగాల కాలనీకి చెందిన పస్తం వసంత(45)పాము కాటుకు గురై చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 2న బోళ్ల వ్యాపారం ముగించుకుని ఇంటికి వచ్చిన వసంత గుడిసె ముందు చాపపై విశ్రాంతి తీసుకుంటుండగా కుడి మోకాలి పైభాగంలో పాము కాటు వేసింది. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం సుమారు 6:30 గంటలకు వసంత మృతిచెందింది. సమాచారం అందుకున్న పరకాల పోలీసులు ఎస్‌హెచ్‌వో ఆదేశాల మేరకు ఎంజీఎం ఆసుపత్రికి చేరుకుని మృతురాలి భర్త వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# కుటుంబ కలహాలతో తండ్రి రాక్షసత్వం

నాలుగేళ్ల కుమారుడిని బండకేసి కొట్టిన దుర్మార్గుడు

హైదరాబాద్, నేటిధాత్రి:

నగరంలోని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తండ్రి.. నాలుగేళ్ల కుమారుడిపై దారుణంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

తండ్రి సల్మాన్.. కొడుకు అర్మాన్‌ను ఓ పిల్లర్‌కు బలంగా కొట్టి నేలపై పడేశాడు. అంతటితో ఆగకుండా బాలుడిని లారీ కిందకు నెట్టేందుకు ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు బాలుడిని కాపాడారు.

తీవ్రంగా గాయపడిన అర్మాన్‌ను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుడిమల్కాపూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని నిందితుడు సల్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. సల్మాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# పూర్తికావచ్చిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

హైదరాబాద్, నేటిధాత్రి:

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నూతనంగా రూపుదిద్దుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.680 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక స్టీల్ బ్రిడ్జి చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు, అలాగే మరోవైపు చంపాపేట వైపు సులభంగా వెళ్లేలా మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. అతి త్వరలోనే ఈ వంతెనను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్ గూడ, చంపాపేట తదితర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించడమే కాకుండా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. అలాగే మూసారాంబాగ్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు సైతం చివరి ఘట్టానికి చేరుకున్నాయని, రాకపోకలకు వీలుగా అప్రోచ్ రోడ్ల విస్తరణను వేగవంతం చేశామని తెలిపారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన బ్రిడ్జి పనులతో పాటు పెండింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజా రవాణాను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే జీఎస్సార్



భూపాలపల్లి, నేటిధాత్రి :

టేకుమట్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హాస్టల్‌లోని వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహారం గురించి ఆరా తీశారు.

విద్యార్థులతో మాట్లాడిన ఎమ్మెల్యే పాఠశాలలో వసతులు బాగున్నాయని, భోజనం నాణ్యంగా రుచికరంగా అందిస్తున్నారని విద్యార్థులు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, చదువుపై పూర్తి దృష్టి సారించాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అధలకు కలెక్టర్ విజయలక్ష్మి పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న సిబ్బంది పాల్గొన్నారు

# మాజీ ఎమ్మెల్యే నన్నపునేని జన్మదినం సందర్భంగా రక్తదానం

రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్న 41వ డివిజన్ మైనారిటీ నాయకుడు మహమ్మద్ అలీ





- గత కొన్నేళ్లుగా నన్నపునేని నరేందర్ వెన్నంటి ఉంటూ ప్రజాసేవలో చురుకైన పాత్ర
- సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్న సోషల్ మీడియా ఇంచార్జి
- ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న యువ నాయకుడు మహమ్మద్ అలీ
- రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలతో డివిజన్ ప్రజలకు చేరువ కానున్న నాయకుడు
- నాయకుడి జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చిన మహమ్మద్ అలీకి ప్రశంసలు

వరంగల్, నేటిధాత్రి:

మాజీ ఎమ్మెల్యే, వరంగల్ తొలి మేయర్ నన్నపునేని నరేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో 41వ డివిజన్ మైనారిటీ నాయకుడు, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి మహమ్మద్ అలీ రక్తదానం చేశారు. నరేందర్ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఏడాది జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత కొన్నేళ్లుగా నన్నపునేని నరేందర్ వెన్నంటి ఉంటూ పార్టీ కార్యక్రమాలు, ప్రజాసేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న మహమ్మద్ అలీ, భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలుస్తానని పేర్కొన్నారు. రక్తదానం మహాదానం అని, యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# మాగ్నస్ అసోసియేట్స్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం..

-ప్రారంభించిన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్..





హనుమకొండ నేటిధాత్రి:

మాగ్నస్ అసోసియేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మన ఇల్లు డెవలపర్స్ మరియు ఏకర్స్ ఎన్ యార్డ్స్ కంపెనీల హంటర్ రోడ్ లోని నీలిమ జంక్షన్ లో నూతన కార్యాలయ ప్రారంభోత్సవ0 ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ శాసనమండలి ఉపసభాపతి డా. బండా ప్రకాశ్, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మయ్య లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత సేవలందించాలని, మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి తెలంగాణ వ్యాప్తంగా మరెన్నో బ్రాంచ్ లు ఏర్పాటు చేయాలని కోరారు. మాగ్నస్ అసోసియేట్స్, సాఫ్ఫైర్ మరియు మన ఇల్లు డెవలపర్స్, ఏకర్స్ ఎన్ యార్డ్స్ రియల్ ఎస్టేట్ కంపెనీలు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కంపెనీ వ్యవస్థాపకుడు అండ్ సి.ఇ.ఓ రాచర్ల రాజేష్ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్. సుధాకర్ రెడ్డి, రాజగోపాల్ , పాపయ్య,నరహరి మేనేజర్ ఎన్. శివకుమార్, అసిస్టెంట్ మేనేజర్ జి. రవికుమార్ టి. వీణ, కాసు శ్రీకాంత్, శర్మ, అనుష, అఖిల తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# చర్ల ఆదివాసి బడులకు రూ.10 లక్షల నిధులు ఇవ్వండి!

19 వలస గ్రామాల పాఠశాలల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజల డిమాండ్

సీబీఎస్ఈ విద్య.. సోలార్ సదుపాయం.. పౌష్టికాహారం అందించాలని విజ్ఞప్తి

నేటిధాత్రి ప్రత్యేక కథనం

సీనియర్ జర్నలిస్ట్: నరసింహ

చర్ల మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

చర్ల మండలంలోని 19 వలస ఆదివాసి గ్రామాల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని స్థానిక ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు. ప్రతి పాఠశాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు విడుదల చేసి గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

### రూ.10 లక్షలతో నాలుగు ప్రధాన సదుపాయాలు

ప్రతి పాఠశాలకు కేటాయించే రూ.10 లక్షల నిధులతో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పాఠశాల భవనాలపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### గిరిజన బిడ్డలకు నాణ్యమైన విద్య అవసరం

వలస ఆదివాసి పిల్లలకు సాధారణ విద్యతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు సీబీఎస్ఈ సిలబస్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. చిన్నారుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక విద్యా ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు

1. విద్య:

వలస ఆదివాసి విద్యార్థులకు సీబీఎస్ఈ విధానంలో నాణ్యమైన విద్య అందించాలి.

2. ఆహారం:

పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి.

3. యూనిఫామ్:

గిరిజన విద్యార్థులకు ప్రత్యేక స్కూల్ యూనిఫామ్ సౌకర్యం కల్పించాలి.

4. రహదారులు:

వలస ఆదివాసి గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలి.



### గవర్నర్ పర్యవేక్షణలో పాఠశాలలు నడపాలి

చర్ల వలస ఆదివాసి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు తెలంగాణ గవర్నర్ పర్యవేక్షణలో సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని నేటిధాత్రి విజ్ఞప్తి చేస్తోంది. విద్యా రంగంలో ప్రత్యేక దృష్టి సారిస్తేనే గిరిజన బిడ్డల భవిష్యత్ బంగారుమయం అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

### అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో శ్రీ రాహుల్ ఐఏఎస్, జిల్లా కలెక్టర్ శ్రీ అంకిత్ ఐఏఎస్‌లు వలస ఆదివాసి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారికి మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్య, రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారానే అనాదిగా వెనుకబడిన వలస ఆదివాసి గ్రామాల పిల్లల జీవితాల్లో మార్పు వస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సబ్‌సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** వర్షాకాలంలో ప్రజారోగ్య సేవలను పటిష్టం చేయడంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. మధుసూదన్ పిడిసిల్ల, మొట్లపల్లి సబ్‌సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రొటీన్ టీకాలు, రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణకు జ్వర సర్వేలు, దోమల నియంత్రణ చర్యలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు సూచించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. నాగరాణి, మండల వైద్యాధికారి డా. నవత తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



**మంచిర్యాల, నేటిధాత్రి:** జిల్లాలో రెవెన్యూ, పౌర సరఫరాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. కోటపల్లిలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి తదుపరి చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. చెన్నూర్‌లో ఎంఎల్ఎస్ గోదాంను సందర్శించి ఈ నెల 15లోగా బియ్యం తరలింపు పూర్తి చేయాలని, రేషన్ కార్డుదారుల ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పురోగతిని సమీక్షించి పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని సూచించారు.

# ఈ నెల 9,10 తేదీల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభలు

## ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి....



**నర్సంపేట, నేటిధాత్రి:** దివంగత నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కర్మ సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నల్లబెల్లి మండలంలోని పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ నెల 9న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం నిర్వహించనున్న సంస్మరణ సభలో పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంస్మరణ సభకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన



**సిరిసిల్ల, నేటిధాత్రి:** రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సిరిసిల్ల విద్యానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీటీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని, మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు. అతివేగం, సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. విద్యార్థులు రహదారి భద్రతపై కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన పాఠశాల భవనం ప్రారంభం




**కేసముద్రం, నేటిధాత్రి:** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మంగారి గుడి తండ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి బుధవారం ప్రారంభించారు. 25 ఏళ్లుగా రేకుల షెడ్లో కొనసాగుతున్న పాఠశాలకు ప్రత్యేక చొరవతో అద్దె భవనం ఏర్పాటు చేశామని, దాని అద్దెను జిల్లా విద్యాశాఖ చెల్లిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి మంచి స్థాయికి ఎదగాలని దీవెనలు ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యాబోధనలో మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ అప్పారావు, ఏఎంఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ కాలేరు యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిట్కుల్‌లో ఘనంగా దుర్గమ్మ జాతర



**పటాన్‌చెరు, నేటిధాత్రి:** దుర్గమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ ఆకాంక్షించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహించిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా శ్రీ దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు నాగర్‌కర్నూల్ జిల్లా రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిధి హాజరై అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం నీలం మధు ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఫలారం బండి ఊరేగింపును నీలం మధు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వద్దిపేట చెక్‌డ్యాంకు అనుమతులు ఇవ్వాలి



**చర్ల, నేటిధాత్రి:** చర్ల మండల అభివృద్ధి, రైతుల సమస్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కాంగ్రెస్ నాయకులు చర్చించారు. మండల పర్యటనకు వచ్చిన మంత్రికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వద్దిపేట చెక్‌డ్యాం నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. చెక్‌డ్యాం నిర్మాణంతో వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల జీవనోపాధి మెరుగుపడుతుందని వివరించారు. చర్ల మండలంలోని వ్యవసాయ అవసరాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూడా మంత్రికి వివరించారు. వినతులను స్వీకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# 12 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పోతుగల్లు గ్రామంలో కాలిపోయిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి కేవలం 12 గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గ్రామ సర్పంచ్ ఎలిగేటి తిరుపతి విజ్ఞప్తిపై స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ నగేశ్ ఆధ్వర్యంలో లైన్‌మ్యాన్ శ్రీనివాస్, జూనియర్ లైన్‌మ్యాన్ సంపత్‌రావు, రేల నరేష్‌తో కూడిన సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. సమస్యను వేగంగా పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని గ్రామస్థులు అభినందించారు.

# పేదలకు న్యాయ సేవాధికార సంస్థ అండ



**భూపాలపల్లి, నేటిధాత్రి:** కేసుల్లో చిక్కుకుని ఇబ్బందులు పడే పేదలకు న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కంప అక్షయ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్ ద్వారా కొంపెల్లి, తండా, గొర్లవీడు, హన్నాన్‌పల్లి గ్రామాల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కుటుంబ, సివిల్, ప్రామిసరీ నోట్ వివాదాలు తదితర కేసుల్లో న్యాయం పొందేందుకు సహాయం అందిస్తామని తెలిపారు. న్యాయ సహాయం కోసం నల్సా టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ మహాసభను విజయవంతం చేయాలి




**పటాన్‌చెరు, నేటిధాత్రి:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పటాన్‌చెరు నియోజకవర్గ మహాసభను జర్నలిస్టులంతా కలిసి విజయవంతం చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు బాదిని శ్రీను, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సత్యం పిలుపునిచ్చారు. పటాన్‌చెరులోని ఐబీ అతిథి గృహంలో నిర్వహించే ఈ మహాసభకు నియోజకవర్గంలోని వర్కింగ్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమం, సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**చర్ల, నేటిధాత్రి:** సురక్షక్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, సీఐ రాజువర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీలు, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్ ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు పి. కేశవ్, ఆర్. నరసింహారెడ్డి, ప్రిన్సిపల్ నరేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**వీణవంక, నేటిధాత్రి:** సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి సూచించారు. ఘన్ముక్ల మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సైబర్ జాగ్రూక్తా దివస్ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫేక్ ట్రేడింగ్ యాప్‌లు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఫిషింగ్ లింకులు, ఓటీపీ, బ్యాంకు వివరాలు అడిగే మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కిట్స్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన



**కోదాడ, నేటిధాత్రి:** సైబర్ నేరాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి మోసాలకు పాల్పడుతున్నారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీఐ శివశంకర్ సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరమని తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై అంజిరెడ్డి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. ఎస్సై అజయ్ కుమార్ నకిలీ సోషల్ మీడియా ఖాతాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీస్ అక్క మీనా విద్యార్థినులకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు కలెక్టర్ సూచనలు



**భూపాలపల్లి, నేటిధాత్రి:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వెంకటరత్నం బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో వైద్య సేవలు, సిబ్బంది సమయపాలన, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రి పరిశుభ్రతను పకడ్బందీగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, వైద్య సేవల కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు.

# ప్రైవేట్ పాఠశాలపై విచారణ చేపట్టాలని వినతి

## అర్హతలు లేని ఉపాధ్యాయులతో బోధన, అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత డిమాండ్



**నల్లబెల్లి, నేటిధాత్రి:** నల్లబెల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన, అధిక ఫీజుల వసూళ్లపై విచారణ చేపట్టాలని తెలుగు యువత నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడుకు వినతిపత్రం అందజేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొంగర ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు డీఈవోను కలిసి పాఠశాల యాజమాన్యంపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల అర్హతలు, విద్యా ప్రమాణాలు, ఫీజుల వసూళ్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా తెలుగు యువత ప్రతినిధులు పాల్గొన్నారు.

# కొమురం భీమ్ విగ్రహావిష్కరణ



**జైపూర్, నేటిధాత్రి:** జైపూర్ మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి ఆదివాసీలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పెన్షన్లు తదితర సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. జైపూర్‌లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, చెన్నూర్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అర్హులైన గిరిజనులకు పోడు హక్కులు, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# ఆశ్రమ పాఠశాలలో సమస్యలు

## చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి...



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండలం వెలుగు బాలికల ఆశ్రమ పాఠశాలలో వీధికుక్కల సంచారం, పారిశుధ్య లోపాలతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సామాజిక ఉద్యమకారుడు ఎలుకటి రాజయ్య ఆరోపించారు. ఇటీవల ఇద్దరు విద్యార్థినులు కుక్కల దాడిలో గాయపడినట్లు తెలిపారు. బాత్రూములు పరిశుభ్రంగా లేకపోవడంతో విద్యార్థినులు అనారోగ్యానికి గురవుతున్నారని, పాఠశాలలో వారితో గడ్డి తీయించే పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలపై పాఠశాల ప్రిన్సిపాల్ స్పందించడం లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని పాఠశాలలో పారిశుద్ధ్యం మెరుగుపరచడంతో పాటు వీధికుక్కల బెడద నివారించి విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కల్పించాలని కోరారు.

# రూ.1.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**పటాన్‌చెరు, నేటిధాత్రి:** పటాన్‌చెరు, ముత్తంగి డివిజన్ల పరిధిలో రూ. 1.40 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. నందన్ ప్యారడైజ్ కాలనీలో సీసీ రోడ్లు, డీఎన్ కాలనీలో పైప్‌లైన్ నిర్మాణం, వెలిమల స్మశానవాటికలో రిటైనింగ్ వాల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కాలనీకి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా, విద్యుత్, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# మోకుదెబ్బ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిల నియామకం



## గౌడ గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమ నిర్మాణం...

**హైదరాబాద్, నేటిధాత్రి:** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ తెలంగాణ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిలను నూతనంగా నియమించినట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన మోకుదెబ్బ పొలిట్‌బ్యూరో సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. గౌడ గీత కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సంస్థను మరింత బలోపేతం చేసేందుకు పొలిట్‌బ్యూరో సభ్యులను ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తెలిపారు. ఈ నియామకాలు తదుపరి రాష్ట్ర మహాసభ జరిగే వరకు కొనసాగుతాయని తెలిపారు. త్వరలోనే తెలంగాణలోని జిల్లాలకు రాష్ట్ర నాయకులను ఇన్‌చార్జిలుగా నియమించనున్నట్లు మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉమ్మడి జిల్లాల నూతన ఇన్‌చార్జిలు వీరే..
- ఉమ్మడి ఆదిలాబాద్ -- శ్రీపతి లింగాగౌడ్,
- ఉమ్మడి కరీంనగర్ -- కేసరి ఆంజనేయులు గౌడ్,
- ఉమ్మడి వరంగల్ -- ముత్యం నర్సింలు గౌడ్,
- ఉమ్మడి ఖమ్మం -- అనంతుల రమేష్ గౌడ్,
- ఉమ్మడి రంగారెడ్డి -- బాలసాని సురేష్ గౌడ్, సీనియర్ హైకోర్టు న్యాయవాది,
- ఉమ్మడి మెదక్ -- కొండాపురం బాలరాజ్ గౌడ్
- ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ -- రాగుల సిద్ధిరాములు గౌడ్,
- ఉమ్మడి హైదరాబాద్, మహబూబ్‌నగర్ -- అమరవేణి నర్సాగౌడ్,

# డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన



**పరకాల, నేటిధాత్రి:** పరకాల మున్సిపల్ పరిధిలోని 1, 12వ వార్డుల రజకవాడలో చేపట్టిన నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ప్రవీణ్, కౌన్సిలర్లు దుబాసి వెంకటస్వామి, ఆకుల లావణ్య శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వే నంబర్ 111/1 ప్రభుత్వ భూమిని కాపాడాలి

## తహసీల్దార్‌కు ఎంసీపీఐ(యు) నేతల వినతి



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణ శివారులోని మాదన్నపేట రోడ్డులో సర్వే నంబర్ 111/1లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ, నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి కోరారు. ఈ మేరకు నిరుపేదలతో కలిసి నర్సంపేట తహసీల్దార్ రవిచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దొమ్మటి సత్యం కట్టెకోత మిల్లు వెనుక ఉన్న సర్వే నంబర్ 111/1 ప్రభుత్వ భూమిలో దళిత నిరుపేదలు, ఒంటరి మహిళలు గత ఐదేళ్లుగా గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇటీవల కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆ భూమి తమదేనంటూ అక్కడ నివసిస్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. డోజర్లతో గుడిసెలను కూల్చివేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, గ్రీన్‌ల్యాండ్ భూములను అర్హత లేని కొందరు వ్యక్తులు ఆక్రమించి విక్రయాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి సర్వే నంబర్ 111/1 భూమిని కాపాడాలని, అక్కడ ఐదేళ్లుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోకపోతే ఎంసీపీఐ(యు) ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జన్ను విజయ, మేర్గు జయ, బెజ్జంకి పుష్ప, వేమునూరు సుమ, కోమల, పిట్టల పద్మ, ఈసంపల్లి కోమల, గొడిశాల లక్ష్మి, జవాజి సమ్మక్క, దొమ్మటి విమల, బాదావత్ రుక్కమ్మ, అబ్బదాసి ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 30లోగా టీఎన్జీవో సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి



**మంచిర్యాల, నేటిధాత్రి:** టీఎన్జీవో సభ్యత్వ నమోదును సెప్టెంబర్ 30లోగా పూర్తి చేసి రాష్ట్రంలోనే 100 శాతం నమోదు సాధించిన జిల్లాగా మంచిర్యాలను నిలపాలని జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం, ఆరు డీఏల విడుదల, పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, హెల్త్ కార్డు విస్తరణ తదితర అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇటీవల అదనపు బాధ్యతలు స్వీకరించిన శ్రీపతి బాపురావును సన్మానించగా, నడిమెట్ల సత్యనారాయణను జిల్లా ఉపాధ్యక్షుడిగా కో-ఆప్షన్ ద్వారా నియమించారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటే యువతకు ఉజ్వల భవిత



**నడిగూడెం, నేటిధాత్రి:** మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నడిగూడెం ఎస్సై తేజస్విని అన్నారు. స్థానిక కెవిఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ డ్రగ్స్, సైబర్ నేరాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు అవగాహన వీడియోలు ప్రదర్శించగా, కళాశాల ఆవరణలో యాంటీ డ్రగ్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. విజయ నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై తేజస్వినిని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు



**మంచిర్యాల, నేటిధాత్రి:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద సూచించారు. చెన్నూరులో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమృత్--2.0 కింద రూ. 100 కోట్లతో తాగునీటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఘాట్లు, రహదారులు, భక్తుల సౌకర్యాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

# హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలి రెడ్డబోయిన గోపి



**సిరిసిల్ల, నేటిధాత్రి:** హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 6 నుంచి 15 వరకు తిరంగా యాత్రలు, ర్యాలీలు, ఇంటింటికీ జాతీయ పతాకాల పంపిణీ చేపట్టాలని సూచించారు. ప్రతి కార్యకర్త తన ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రొఫైల్ చిత్రంగా జాతీయ పతాకాన్ని ఉంచాలని కోరారు. అనంతరం ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ కన్వీనర్ పవన్ కుమార్‌ను సన్మానించారు. సమావేశంలో జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల వేతనాల సమస్యపై చైర్‌పర్సన్‌కు వినతి




**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతనపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు వేతనాల సమస్య పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. కొత్త జీవో అమలుతో వేతనాలు తగ్గాయని, గతంలో ఉన్న వేతనాలనే కొనసాగించాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ సమస్యను సానుకూలంగా పరిశీలించి, సీడీఎంఏ అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# విద్యార్థులు అన్ని రంగాలలో స్ఫూర్తిదాయకంగా ఉండాలి.

## జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ సంధ్యారాణి....



**నర్సంపేట, నేటిధాత్రి:** విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో స్ఫూర్తిదాయకంగా ఉండాలని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ సంధ్యారాణి అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నస్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలలో జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ముందుగా గురుకుల పాఠశాల పరిసరాలను, భోజన వసతులు, నిత్యవసర వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రత్యేక అధికారిని మంజుల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు వారి ఎదుగుదళ పట్ల జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమం వల్ల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరో అధికారి రాజయ్య, ఉపాధ్యాయులు స్రవంతి, సరస్వతి, సుభాషిని, సంధ్య, రమ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి




**మంచిర్యాల, నేటిధాత్రి:** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మందమర్రి పోలీసులు సూచించారు. స్థానిక మదర్ తెరెసా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆన్‌లైన్ మోసాలు, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్‌పై జాగ్రత్తలు వివరించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీ ఎవరికీ చెప్పొద్దని సూచిస్తూ, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎరువుల డీలర్లకు ఏడీఏ హెచ్చరిక



**పరకాల, నేటిధాత్రి:** ఎరువులను అధిక ధరలకు విక్రయించడం, లింక్ సేల్స్ నిర్వహించడం, కృత్రిమ కొరత సృష్టించడం, నిషేధిత పురుగుమందులు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ జె. అవినాష్ వర్మ హెచ్చరించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనిఖీల్లో ఉల్లంఘనలు గుర్తించిన క్రాంతి ట్రేడర్స్, భద్రకాళి ఫర్టిలైజర్స్ సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు అక్రమాలు గమనిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాస్, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా




## మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్...

**నర్సంపేట, నేటిధాత్రి:** బిడ్డ పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, కనీసం నీరు కూడా పట్టించకూడదని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నర్సంపేట ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలింతలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవం అనంతరం వెలువడే ముర్రుపాలు శిశువుకు ఎంతో మేలు చేస్తాయని, అవి బిడ్డకు తొలి వ్యాధి నిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లి, బిడ్డల మధ్య అనుబంధం పెరగడంతో పాటు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల సిబ్బంది మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలి...

నర్సంపేట ప్రాజెక్టు సీడీపీవో మధురిమ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సీసా పాలు అలవాటు చేయకూడదని సూచించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము, అండాశయ క్యాన్సర్ల ముప్పు తగ్గుతుందని, శిశువు శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసం, మేధోశక్తి పెంపునకు తల్లిపాలు ఎంతో దోహదపడతాయని వివరించారు. అనంతరం ఆసుపత్రిలోని బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీరామోజు రోజారాణి, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనీషా ప్రకాష్, ఏసీడీపీవో జ్యోతి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి, ఆర్ఎంవో డాక్టర్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆనంద అర్చాణ, సూపర్‌వైజర్లు అరుణ, రమ, ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొర్రె రాధ, బతిని శిరీష, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పీపీ యూనిట్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ విద్యా పర్యటనలకు ఉపాధ్యాయుల ఎంపిక

## ఆగస్టు 6న ఇంటర్వ్యూలు.. డీఈఓ బి. రంగయ్యనాయుడు...

**వరంగల్, నేటిధాత్రి:** ప్రపంచ స్థాయి ఉత్తమ బోధనా విధానాలను ఉపాధ్యాయులకు పరిచయం చేసి, వారి వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్స్, విద్యా మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (ఎఫ్ఏసీ) బి. రంగయ్యనాయుడు తెలిపారు. కార్యక్రమం రెండో దశలో భాగంగా సెప్టెంబర్, అక్టోబర్ 2026లో ఫిన్లాండ్, సింగపూర్, జపాన్, వియత్నాం, చైనా దేశాల్లో విద్యా అధ్యయన పర్యటనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా పరిధిలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ, టీజీఎంఎస్, టీజీఆర్ఈఐఎస్, కేజీబీవీ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు ఉపాధ్యాయులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అర్హులైన ఉపాధ్యాయులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్స్ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ ఆగస్టు 6న ఉదయం 10.30 గంటలకు వరంగల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు తమ విద్యా, ఉద్యోగ సంబంధిత అవసరమైన ధ్రువపత్రాల అసలు ప్రతులతో పాటు స్వీయ ధ్రువీకరించిన జిరాక్స్ ప్రతులను తీసుకుని నిర్ణీత సమయానికి హాజరు కావాలని డీఈఓ సూచించారు.

# సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ నిరసన



**సిరిసిల్ల, నేటిధాత్రి:** సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు.
అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పడకలు, పుస్తకాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, కార్యదర్శి మంద అనిల్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మండలస్థాయి సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే హెచ్చరిక



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండలస్థాయి సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వివిధ శాఖల అధికారుల పనితీరును సమీక్షించారు. గ్రామాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించిన ఆయన, విద్యుత్, రహదారులు, ఇందిరమ్మ ఇళ్ల మౌలిక వసతులు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండలస్థాయి సమావేశాలకు హాజరుకాని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సస్పెండ్ చేయాలని హెచ్చరించారు. అధికారులు పార్టీలకతీతంగా పనిచేసి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రామకృష్ణాపూర్‌లోని కాకతీయ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, నవజాత శిశువులకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాల్సిన అవసరంపై వైద్యులు అవగాహన కల్పించారు. విద్యానగర్‌లోనూ అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

## ‘స్ఫూర్తి’ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్...



**నర్సంపేట, నేటిధాత్రి:** విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ, ప్రసంగ నైపుణ్యాలను అలవర్చుకోవాలని వరంగల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి ఆదేశాల మేరకు బుధవారం దుగ్గొండి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిబాఫులే గురుకుల బాలుర పాఠశాలలో ‘స్ఫూర్తి’ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్‌తో పాటు దుగ్గొండి ఎంపీడీవో లెక్కల అరుంధతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.వి. గణేష్ మాట్లాడుతూ ‘స్ఫూర్తి’ కార్యక్రమాన్ని రూపొందించి విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు స్వీయ అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఏయే అంశాలపై తమకు మంచి పట్టు ఉందో గుర్తించుకోవాలని సూచించారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగడం, సానుభూతితో వ్యవహరించడం, భావవ్యక్తీకరణ, ప్రసంగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. ప్రతిరోజూ యోగా చేయాలని, వేమన శతక పద్యాలను చదవాలని సూచించారు. స్ఫూర్తినిచ్చిన మహనీయుల జీవిత చరిత్రలను చదవడంతో పాటు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలను తెలుసుకోవాలని కోరారు. మంచి వ్యక్తులతో స్నేహం చేస్తూ ‘స్ఫూర్తి’ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.



## లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడాలి...

ఎంపీడీవో లెక్కల అరుంధతి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని, పుస్తకాలను క్రమం తప్పకుండా చదవాలని సూచించారు. ఒత్తిడికి లోనుకాకుండా ఆసక్తితో చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని కోసం నిరంతరం శ్రమించాలని తెలిపారు. అన్ని సబ్జెక్టులను చదవడంతో పాటు తమకు ఇష్టమైన అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. మార్కులపై మాత్రమే దృష్టి పెట్టకుండా చదువుపై కృషి చేయాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తోందని, అవకాశాలను సద్వినియోగం చేసుకుని భావి భారత నిర్మాతలుగా ఎదగాలని కోరారు. ప్రతీ అంశాలను విద్యార్థులు పాటించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ లక్ష్య సాధన కోసం అహర్నిశలు కృషి చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య సూచించారు.

**పాఠశాలలో వసతుల పరిశీలన..** అనంతరం అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, ఎంపీడీవో అరుంధతి పాఠశాలలోని వంటశాల, స్టోర్‌రూమ్, భోజనశాల, తరగతి గదులు, డార్మిటరీలు, ఆర్వో వాటర్ ప్లాంట్, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు పాఠశాలలో కల్పిస్తున్న వసతులపై అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏటీపీ రాజు, డిప్యూటీ వార్డెన్ కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి విస్తరణతో వేలాది మందికి ఉపాధి



**శ్రీరాంపూర్, నేటిధాత్రి:** సింగరేణికి కొత్త బొగ్గు బ్లాక్‌ల కేటాయింపుతో సంస్థ ఆదాయం పెరగడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. శ్రీరాంపూర్ ఆర్కే-7 గనిలో కార్మికులను కలిసిన ఆయన, మణుగూరు పీకేఓసీ-2, తాడిచెర్ల-2 బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా భారీ స్థాయిలో బొగ్గు ఉత్పత్తితో పాటు సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం సమకూరి వేలాది మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో చైతన్యం పెంపొందించాలి

## వరంగల్ జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ జిల్లా ప్రతినిధి, నేటిధాత్రి:** స్ఫూర్తి కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో చైతన్యం పెంపొందించాలని వరంగల్ జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న ‘స్ఫూర్తి’ కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట గిరిజన బాలికల వసతి గృహాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి విద్యార్థినులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో రాజ్యాంగంలోని నాలుగో



స్థంభంగా భావించే జర్నలిజం ప్రాముఖ్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.
జిల్లా కలెక్టర్ విద్యార్థినుల విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి సౌకర్యాలు, ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసంపై కూడా దృష్టి సారించాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు, కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థినులు భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాలు ఏర్పరుచుకొని స్వీయ చైతన్యంతో ముందుకు సాగాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి కోసం ప్రతిరోజూ వార్తాపత్రికలు చదివే అలవాటు పెంచుకోవాలని, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వంట సామాగ్రి నిల్వలు పరిశీలించారు. వర్షాకాలం జాగ్రత్తంగా శుభ్రత పరిశుభ్రత పాటించాలని వార్డెన్ ను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పిల్లలతో కలిసి భోజనం చేశారు. పిల్లలతో ముచ్చటించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డిబీసీడీఓ పుష్పలత, డిటిడిఓ నారాయణరెడ్డి, తహసిల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన




**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** మండలంలోని మోట్లపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై ముప్పు సురేష్ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సైబర్ భద్రతపై అవగాహన వీడియోను ప్రదర్శించగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవోకు శుభాకాంక్షలు



**జహీరాబాద్, నేటిధాత్రి:** కోహీర్ మండల నూతన ఎంపీడీవో ఉమాదేవిని మండల ఫీల్డ్ అసిస్టెంట్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో ఉమాదేవి సూచించారు.

## పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన



**జహీరాబాద్, నేటిధాత్రి:** ఝరాసంగం మండలం సిద్ధాపూర్ రైతు వేదికలో రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోయాబీన్, కంది, పెసర, మినుము, పత్తి పంటల సాగులో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలపై కెవికె శాస్త్రవేత్త రమేష్, వ్యవసాయ అధికారి వినోద్ రైతులకు వివరించారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం, పురుగు--తెగుళ్ల నివారణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## శాఖంబరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆర్కే--3 ప్రాంతంలోని శ్రీ శాఖంబరి అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కటకం కుమారస్వామి వేదమంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు నిర్వహించగా, అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.

## అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**తంగళ్లపల్లి, నేటిధాత్రి:** తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ, శిశువులకు ఏడాది పాటు తల్లిపాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా అన్నప్రాశన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోర లక్ష్మీరాజం, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ స్రవంతి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, సిబ్బంది, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



**చిట్యాల, నేటిధాత్రి:** మండల సర్వసభ్య సమావేశంలో చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి--అంతయ్య ఎమ్మెల్యేకు గ్రామ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వీధికుక్కలు, కోతుల బెడద నివారణతో పాటు రాతిమట్ట చెరువు కట్ట నిర్మాణం, ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్‌డీసీ ఏర్పాటు, ఆక్సిజన్ ప్లాంట్, పీడియాట్రిక్ వార్డు ప్రారంభం, డ్రైనేజీ, గ్రామపంచాయతీ భవనం నిర్మాణం, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

## గృహ కార్మికుల్లో రాజకీయ చైతన్యం పెరుగుతోంది

### ప్రొఫెసర్ సమీతా సేన్...



**పటాన్‌చెరు, నేటిధాత్రి:** పశ్చిమ బెంగాల్‌లో గృహ కార్మికుల్లో గుర్తింపు, న్యాయమైన వేతనాలు, చట్టపరమైన రక్షణ కోసం రాజకీయ చైతన్యం పెరుగుతోందని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ చరిత్రకారిణి ప్రొఫెసర్ సమీతా సేన్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఆన్‌లైన్ ఆతిథ్య ఉపన్యాసంలో ఆమె మాట్లాడుతూ గృహ కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లు, కార్మిక సంఘాల పాత్ర, లింగ సమానత్వం, పట్టణీకరణ వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల--సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణకు ముందడుగు

**సిరిసిల్ల, నేటిధాత్రి:** సిరిసిల్ల--సిద్దిపేట (దుద్దెడ) జాతీయ రహదారి ఎన్‌హెచ్--365బీని నాలుగు లేన్లుగా విస్తరించే ప్రక్రియలో కదలిక వచ్చింది. రహదారి విస్తరణకు సంబంధించిన డీపీఆర్ ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి కార్యాలయం జాతీయ రహదారుల శాఖకు వినతిని పంపించింది. రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## ఆరోపణలు నిరాధారం.. చర్చకు సిద్ధం

### ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు.



**మంచిర్యాల, నేటిధాత్రి:** తనపై వస్తున్న అవినీతి, ఆర్థిక అక్రమాల ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.450 కోట్ల మోసం చేశానన్న ప్రచారం అవాస్తవమని, రాజకీయ కుట్రలో భాగంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నిజానిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తే అన్ని ఆధారాలు సమర్పించేందుకు సిద్ధమని, అవసరమైతే బహిరంగ చర్చకూ సిద్ధమని తెలిపారు. అసత్య కథనాలు ప్రచురించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు



**కేసముద్రం, నేటిధాత్రి:** కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు కేక్ కట్ చేసి చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సేవలో గంట సంజీవరెడ్డి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు రావుల మురళి, బండారు దయాకర్, మాజీ ఉపసర్పంచ్ పోలేపాక నాగరాజు, మాజీ సర్పంచ్ ముదిగిరి సాంబయ్య, కౌన్సిలర్ తరాల వీరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చిదూరాల వసంతరావు, ఎండి అయూబ్ ఖాన్, వోలం కృష్ణమూర్తి, కనుకుల రాంబాబు, బానోత్ బాధ్య, వల్లందాస్ రవి, చిలువేరు సమ్మయ్య గౌడ్, పోలేపల్లి వెంకట్‌రెడ్డి, నూకల వెంకటేశ్వర్లు, రఫీ, అల్లం గణేష్ యాదవ్, ఎండి నవాజ్ అహ్మద్, తుంపిల వెంకన్న, మల్లారెడ్డి, శ్రీహరి, బాల, ఎండి తాజోద్దీన్, ఎండి రషీద్ ఖాన్, ముజ్జు షేక్, శ్రీరామ్ కిరణ్, కొల్లూరు శ్రీనివాస్, రాజులపాటి ఉప్పలయ్య, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, బన్నిశెట్టి వెంకటేష్, తొడేటి దినేష్, ఉప్పునూతల శ్రీను, కాత్రేవుల హరికృష్ణ, ఎండి సమీర్, శశి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో డీసీపీ భాస్కర్ ఆకస్మిక తనిఖీ

### ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని ఆదేశం...




**మంచిర్యాల, నేటిధాత్రి:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిపాలన, రికార్డులు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. లక్షెట్టిపేట మీదుగా జాతీయ రహదారి వెళ్లే నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూ వివాదాల పరిష్కారంలో రెవెన్యూ శాఖ నివేదికలను పరిగణనలోకి తీసుకోవాలని, మహిళలు, చిన్నారుల ఫిర్యాదులపై అత్యంత సున్నితంగా స్పందించి తక్షణ సహాయం అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్‌లో ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తనిఖీ అనంతరం స్టేషన్ అధికారులు సంతృప్తికరంగా విధులు నిర్వహిస్తున్నారని డీసీపీ అభినందించారు.

## సికేఎం ప్రభుత్వ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన

### వ్యక్తిగత వివరాలు, ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు: సీఐ షకూర్...




**వరంగల్, నేటిధాత్రి:** దేశాయిపేటలోని సికేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎల్వీ వరప్రసాద్ రావు




మాట్లాడుతూ, ప్రస్తుతం ఇంటర్నెట్ మన జీవితంలో కీలక భాగంగా మారిందని, చదువు, ఉద్యోగం, బ్యాంకింగ్, షాపింగ్, వినోదం తదితర సేవలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయని తెలిపారు. అయితే ఇంటర్నెట్ వినియోగంలో నిర్లక్ష్యం వహిస్తే సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఏ. షకూర్ మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, ఈమెయిల్స్‌లోని లింకులను క్లిక్ చేయవద్దని, ప్రతి ఖాతాకు బలమైన పాస్‌వర్డ్‌ను ఉపయోగించడంతో పాటు టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌ను వినియోగించాలని తెలిపారు. కళాశాల పరిసరాల్లో ఎవరైనా విద్యార్థులు డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ బ్రాంచ్ కానిస్టేబుల్ రాజు మాట్లాడుతూ సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం ప్రమాదకరమని చెప్పారు. అనుమానాస్పద సందేశాలు లేదా వెబ్‌సైట్లు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ భద్రత ప్రతి ఇంటర్నెట్ వినియోగదారుడి బాధ్యత అని, అప్రమత్తంగా ఉంటే వ్యక్తిగత సమాచారం, కుటుంబం, సమాజాన్ని సైబర్ నేరాల నుంచి రక్షించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కెప్టెన్ డాక్టర్ పి. సతీష్ కుమార్, ఎస్సై రోహిత్, లైబ్రేరియన్ అనిల్ కుమార్, డాక్టర్ భరత్, ఆయేషా, వసుధ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, పాషా, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

### ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్‌చెరు, నేటిధాత్రి:** మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నషా ముక్తి భారత్ అభియాన్, బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజం నష్టపోతాయని తెలిపారు. యువత చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇవి పాలా!... పాయిజనా..!?

- రోజురోజుకు పెరిగిపోతున్న పాలదందా! పరేషాన్ అవుతున్న ప్రజల బాధ..!
- కెమికల్స్, రసాయనాలతో కృతిమంగా ఉత్పత్తి అవుతున్న పాలు..!
- అంతరించిపోతున్న మూగజీవాలు...! ఆకర్షణీయంగా పాల ప్యాకెట్లు..!?
- అసలు సరఫరాకు డిమాండ్ కు ఏమన్నా సంబంధం ఉందా?
- "పాల"ను"కొని" తెచ్చుకుంటున్న రోగాలు ఎన్నో..!?



**హన్మకొండ, నేటిధాత్రి:** తెల్లనివన్నీ పాలని... నల్లని వన్నీ నీళ్ళని అనుకుంటూ... జనాలు మార్కెట్లో లభించే పాలను గుడ్డిగా నమ్మి మోసపోతున్నారు. పాలు అంటే ప్రతి ఒక్కరికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ వాటిని తయారు చేసే మనుషుల మనసులు మాత్రం చెడుగా ఉంటున్నాయి. తమ స్వార్థ వ్యాపార ప్రయోజనాల కోసం జనాలను పిచ్చోళ్లను చేస్తున్నారు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని కొంతమంది వివిధ రకాల రసాయనాలు, కెమికల్స్ లాంటి పదార్థాలను ఉపయోగించి కృతిమంగా పాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఇవే పాలను చిన్నపిల్లలకు మొదలుకొని పెద్దవాళ్ళ వరకు వివిధ రూపాల్లో వాడుకుంటున్నారు. పాలు నాసిరకంగా ఉన్నాయో లేవో అని చెక్ చేసుకునే పరిస్థితుల్లో కూడా జనాలు లేరు. రోజురోజుకు పశువుల ఉత్పత్తి తగ్గిపోతుంటే పాల ఉత్పత్తి ఎలా పెరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్లో పాలకు డిమాండ్ ఉండొచ్చు కానీ అందుకు తగ్గ స్వచ్ఛమైన పాల సరఫరా ఎక్కడుందన్న కనీస జ్ఞానాన్ని మర్చిపోతున్నారు. వివిధ కంపెనీలు ఆకర్షణీయంగా తయారు చేసే పాల ప్యాకెట్లను చూసి ఆకర్షితులై కొనుగోలు చేసి తమ ఆరోగ్యాలను అభాసు"పాలు" చేసుకుంటున్నారు. రసాయనాలతో పాల తయారీ..!? ప్రజలను పాలని నమ్మించడానికి వ్యాపారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వివిధ రకాల రసాయనాలతో పాల ఉత్పత్తులను పెంచేస్తున్నారు. న్యూట్రిషన్స్ పేరుతో మనం పిల్లలకు ఇస్తున్న పాలు విషం అని తెలిసి ఆశ్చర్యపోతున్నారు. ప్రిజర్వేటివ్స్ కెమికల్ వాడడంతో పాటు యూరియా ద్వారా సింథటిక్ మిల్క్ ను తయారు చేస్తున్నారు. డిటర్జెంట్ ద్వారా వచ్చే నురుగుతో కూడా పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే రిఫైండ్ ఆయిల్, షుగర్, సాల్ట్ ను ఆడ్ చేస్తూ పాలలో చిక్కదనం తెచ్చి ఆకర్షణీయమైన ప్యాకెట్లను అందిస్తున్నారు. వాటిని మన శరీరంలోకి తీసుకోవడం ద్వారా ప్రమాదకర వ్యాధులు సంభవించేందుకు కారణమవుతున్నాయని, వాస్తవ పరిస్థితులను కూడా అర్థం చేసుకునే స్థితిలో ప్రజలు కనబడటం లేదని న్యూట్రిషనిస్టులు, వైద్యులు పేర్కొంటున్నాను. ఉత్పత్తి అయ్యే పాలకు.. సరఫరా అయ్యే పాలకు ఏమన్నా సంబంధం ఉందా!? రోజురోజుకు పశువుల సంఖ్య తగ్గిపోతుంటే పాల ఉత్పత్తి అంతకంతకు ఎలా పెరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్లో పాలకు ఉన్న డిమాండ్ ను, ప్రజల బలహీనతలను దృష్టిలో పెట్టుకొని కొంతమంది పాలను కల్తీ చేసి విక్రయిస్తున్నారు. ప్యాకెట్లపై ఉన్న మ్యానుఫ్యాక్చర్ డేట్లను కూడా మార్చేస్తున్నారు. పశువులు రోజుకు ఎంత మేత మేసినా ఐదు లీటర్ల నుంచి పది లీటర్ల వరకు పాలు ఇస్తుండొచ్చు. కానీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పశువుల ఉత్పత్తి లేకపోగా పాల ఉత్పత్తి రెట్టింపు అనేది ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఆర్డర్ల మీద అప్పటికప్పుడే వివిధ రకాల ఫంక్షన్లకు 1000 లీటర్ల నుండి 10,000 లీటర్లు కొద్ది పాలను ఎలా సరఫరా చేస్తున్నారో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. "పాల"ను "కొని" తెచ్చుకుంటున్నా రోగాలెన్నో..! ఒకప్పటి మాదిరిగా ప్రస్తుతం పాల నాణ్యత లోపించింది. ఇప్పుడు పసిపిల్లల నుండి పెద్దవాళ్లదాకా పాలను సేవించాలంటే భయమేస్తుంది. కృత్రిమంగా తయారుచేసిన పాల ద్వారా అనేక రోగాలను కొనితెచ్చుకున్నట్లు అవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మానవ శరీరంలో కిడ్నీలు, ఊపిరితిత్తులు, క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధుల ముప్పు పొంచి ఉండే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పాలు విష పదార్థంగా మారుతున్న పరిస్థితుల్లో వాటిని సేవించకపోవడమే ఉత్తమమని సూచిస్తున్నారు. పాలకు బదులు పాల ద్వారా లభించే కాల్షియం, ప్రోటీన్లు ఇతర పదార్థాల ద్వారా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని చెబుతున్నారు. వ్యాపారులు పాలను కల్తీ చేస్తున్నంత ఈజీగా మనము ఆరోగ్యాలను కల్తీ చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పిల్లలు పెద్ద కలలు కనాలి.. సాధించేలా కష్టపడాలి

- జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులతో ముచ్చటించిన జిల్లా కలెక్టర్...
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్...



**సూర్యాపేట, నేటిధాత్రి:** ప్రతి విద్యార్థి జీవితంలో గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు ఇప్పటి నుంచే పునాది వేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేటలో జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. తరగతి గది విద్యతో పాటు డిజిటల్ బోధన, స్పోర్ట్స్, డిసిప్లిన్ విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి ఎంతో కీలకమని స్పష్టం చేశారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యం. తక్షణమే ఐఎఫ్‌పీలు మంజూరు పాఠశాలలో క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ అభ్యర్థన మేరకు పాఠశాలకు వెంటనే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 10 కంప్యూటర్లతో కూడిన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ వసతులను సీఎస్ఆర్ నిధులు లేదా జిల్లా ఫండ్స్ ద్వారా త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. అద్దె భవనంలో ఉన్నప్పటికీ విద్యార్థులకు నీటి వసతి, లైట్లు, ఫ్యాన్లు, బెడ్స్ వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ?పోటీ తత్వం పెంచుకోవాలి విద్యార్థులు తమలో ఉన్న సీనియర్-జూనియర్ హౌసెస్ పోటీల ద్వారా కాంపిటీటివ్ స్పిరిట్, స్పోర్ట్స్ మన్ షిప్ పెంచుకోవాలని సూచించారు. పదో తరగతి తర్వాత ఏ సబ్జెక్ట్ ఇచ్చినా దాన్ని చదివి, నైపుణ్యాలు సాధించే పొటెన్షియల్ మీలో రావాలి. సరైనది ఏది, తప్పు ఏది అని నిర్ణయించుకునే మెచ్యూరిటీని సొంతం చేసుకోవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు కోరిన టేబుల్ టెన్నిస్, ఇతర స్పోర్ట్స్ కిట్స్ పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న కలెక్టర్ తన చిన్ననాటి సైనిక్ స్కూల్ జ్ఞాపకాలను కలెక్టర్ విద్యార్థులతో పంచుకున్నారు. నేను కూడా మీలాగే ఆరో తరగతిలో ఇల్లు వదిలి స్కూల్లో చేరాను. నాతో పాటు చదివిన బ్యాచ్‌మేట్స్‌లో 22 మంది ఈరోజు డిఫెన్స్, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లలో ఉన్నత స్థాయిలో సేవలు అందిస్తున్నారు.



ముగ్గురికి శౌర్య చక్ర అవార్డులు కూడా వచ్చాయని తెలిపారు. నవోదయ విద్యార్థులు భవిష్యత్తులో డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా మాత్రమే కాకుండా దేశాన్ని నడిపించే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారని, వారికి జాతీయ స్థాయిలో సిబిఎస్ఈ ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులోకి రావడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ?త్వరలోనే కోదాడలో పక్కా భవనాలు ?కోదాడ ప్రాంతంలో నవోదయ విద్యాలయం కోసం ఎంపిక చేసిన స్థలంలో భవన నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని కలెక్టర్ తెలిపారు. అన్ని రకాల సౌకర్యాలతో, అకాడమిక్ బ్లాక్, హాస్టల్, స్పోర్ట్స్ ఏరియా, డైనింగ్ హాల్‌తో కూడిన పూర్తిస్థాయి భవనం ఏడాదిన్నర లోపు అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. తాత్కాలికంగా పాఠశాల రన్ అవుతున్నప్పటికీ, బోధన మరియు అభ్యాసన విషయంలో ఎలాంటి కాంప్రమైజ్ ఉండకూడదని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. ?చదువుతో పాటు టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి ?ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలు శరవేగంగా విస్తరిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం తరగతి గది చదువుకే పరిమితం కాకుండా కరిక్యులర్, కో-కరిక్యులర్ ఆక్టివిటీస్‌తో పాటు నూతన సాంకేతిక అంశాలపై ప్రాథమిక అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించి వారి భావి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులతో కలిసి భోజనం కార్యక్రమం అనంతరం కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ప్రత్యేకంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలను సందర్శించడంతో పాటు కిచెన్ లో విద్యార్థులకు అందుతున్న భోజన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ రోజువారీగా వారికి అందిస్తున్న మెనూపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపల్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, గంగాభవాని, జ్ఞానేశ్వరి, రాంబాబు, వైష్ణవి, స్వాతి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అమరదామంలో బహిరంగ ధూమపానం



పరకాల, నేటిధాత్రి: పట్టణంలోని అమరదామంలో కొందరు యువకులు బహిరంగంగా ధూమపానం చేస్తూ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాకింగ్, వ్యాయామం, సేదతీరేందుకు వచ్చే మహిళలు, వృద్ధులు, చిన్నారులు అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. అమరదామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీసు గస్తీ పెంచడంతో పాటు బహిరంగ ధూమపానం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## వర్షపు నీటితో పాఠశాలలో ఇబ్బందులు



కరీంనగర్, నేటిధాత్రి: రామడుగు మండలం గోపాలరావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లైబ్రరీ,



రెండో తరగతి గది, పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండటంతో బురద ఏర్పడి విద్యార్థులు తరగతి గదులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. లైబ్రరీలోని పుస్తకాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు వెంటనే నీటిని తొలగించి, డ్రైనేజీ ఏర్పాటు చేసి, పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## గీత కార్మిక సంఘం నేతలకు సన్మానం



నడిగూడెం, నేటిధాత్రి: కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లును సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో బీసీ హక్కుల సాధన సమితి కోదాడ నియోజకవర్గ అధ్యక్షురాలు మండవ నాగమణి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గీత కార్మికుల పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పెన్షన్ అందించాలని, 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు నెలకు రూ.4 వేల పింఛన్, నీరా కేంద్రాల ఏర్పాటు, తాటి--ఈత వనాల అభివృద్ధికి ప్రభుత్వ భూమి కేటాయింపు వంటి ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గీత కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి



జహీరాబాద్, నేటిధాత్రి: ఆల్గోల్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్ చల్లా శ్రీనివాస్ రెడ్డి విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ప్రమాదకరంగా వేలాడుతున్న తీగలు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డీఈ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పసుపుల ప్రభాకర్, అలోక్, ఎం. అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



జడ్చర్ల, నేటిధాత్రి: బాలానగర్ మండలం చెన్నంగులగడ్డ తండా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం అవసరంపై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రు పాలు పట్టించాలని, తల్లిపాలే శిశువుకు ఉత్తమ ఆహారమని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీనావత్ శ్రీను నాయక్, గ్రామ కార్యదర్శి కీర్తిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## 9న బోనాల జాతర--సీజన్ 2




భూపాలపల్లి, నేటిధాత్రి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా డాన్సర్స్ యూనియన్ ఆధ్వర్యంలో "బోనాల జాతర--సీజన్ 2" కార్యక్రమాన్ని ఈ నెల 9న సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ కార్యక్రమంలో బోనాల నృత్యాలు, జానపద కళారూపాలు, సాంప్రదాయ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. జిల్లాలోని కళాకారులు, యువత, తెలంగాణ సంస్కృతి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



భూపాలపల్లి, నేటిధాత్రి: టేకుమట్ల మండల కేంద్రంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి పన్ను నమోదు, నల్లా కనెక్షన్, విద్యుత్ మీటర్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అంబాల అశ్వద్ధామ పాల్గొన్నారు.

## 6 నుంచి కొత్త యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు



జహీరాబాద్, నేటిధాత్రి: ఈ నెల 6 నుంచి "ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్" యాప్ ద్వారా మాత్రమే ఎరువుల విక్రయాలు చేపట్టనున్నట్లు ఝరాసంగం మండల వ్యవసాయ అధికారి వెంకటేశం తెలిపారు. రైతులు ముందస్తుగా యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులు, రసాయనాలు బుక్ చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కు మొబైల్ నంబర్ తప్పనిసరిగా అనుసంధానమై ఉండాలని, బుకింగ్ చేసిన 48 గంటల్లోపు సంబంధిత కేంద్రంలో ఎరువులు కొనుగోలు చేయాలని తెలిపారు. గడువులోపు కొనుగోలు చేయకపోతే బుకింగ్ రద్దవుతుందని పేర్కొన్నారు. కొత్త విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి



జడ్చర్ల, నేటిధాత్రి: బాలానగర్ మండలం గౌతాపూర్ గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్ తాళ్ల ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధులు విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇండ్లపై నుంచి వెళ్లే విద్యుత్ లైన్ల తొలగింపు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, మహిళా సమైక్య భవనం వద్ద విద్యుత్ లైన్ల మార్పు, సబ్‌స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు నరేష్ యాదవ్, ప్రదీప్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ విమర్శలు అవాస్తవం కాంగ్రెస్



భూపాలపల్లి, నేటిధాత్రి: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు నిరాధారమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దేవాన్, నాయకుడు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు అప్పం కిషన్, కురిమిళ్ల శ్రీనివాస్, సహదేవ్, దుర్గం రాధ, కో--ఆప్షన్ సభ్యుడు హఫీజ్ అహ్మద్, పృథ్వి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

## 14 స్వర్ణాలతో కల్లం అంజిరెడ్డి విద్యాలయకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్



శేరిలింగంపల్లి, నేటిధాత్రి: వికారాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి టైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో మదీనగూడలోని కల్లం అంజిరెడ్డి విద్యాలయ విద్యార్థులు 14 స్వర్ణ పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. సబ్‌జూనియర్, జూనియర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ డా. విజయలక్ష్మి విద్యార్థులను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలోనూ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు శేఖర్, శ్రీకాంత్ సేవలను ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు.

## భౌరంపేట్‌లో ఎమ్మెల్యే వివేకానంద పర్యటన



కుత్బుల్లాపూర్, నేటిధాత్రి: దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ గ్రామంలో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద పర్యటించి రహదారులు, డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న ఆయన దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు వేగవంతం చేయాలని, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం



రామకృష్ణాపూర్, నేటిధాత్రి: బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైడి మల్ల నర్సింగ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. క్యాతన్‌పల్లి కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో జరిగిన వైఫల్యాలు, మోసాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్, దాముక రమేష్, పాముల వెంకటేష్, నేరెళ్లి చంద్రయ్య, పుల్లూరి కళ్యాణ్, నక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ నూతన కమిటీ ఎన్నిక



పరకాల, నేటిధాత్రి: స్థానిక సాహితీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా బొజ్జ హేమంత్, కార్యదర్శిగా మహమ్మద్ అఫ్రోజ్, ఉపాధ్యక్షుడిగా దోమటి విశ్వంత్ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, స్కాలర్‌షిప్‌లు, మెస్ ఛార్జీలు విడుదల చేయడంతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే జీఎస్ఆర్



మొగుళ్లపల్లి, నేటిధాత్రి: మొగుళ్లపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన పోతారవు మొగిలి, సరిగొమ్ముల ఆనంద్ (పాస్టర్) కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ రఫీ, సర్పంచ్ కేతిపెల్లి శిరీష--తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ కుతురు వినోద్, మాజీ ఎంపీటీసీ రెంటల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన




జహీరాబాద్, నేటిధాత్రి: ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా జహీరాబాద్‌లో మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లి పాలు శిశువుకు సంపూర్ణ సహజ ఆహారమని, శారీరక--మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని వివరించారు. జననం వెంటనే తల్లిపాలు పట్టించడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా కుటుంబ సభ్యులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



కేసముద్రం, నేటిధాత్రి: కేసముద్రం విలేజ్ గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం విశ్వబ్రాహ్మణ మహిళలు అమ్మవారిని అలంకరించి తొలి బోనం సమర్పించారు. అనంతరం కుటుంబ సమేతంగా భక్తులు చీర--సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ పెద్దలు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు.

## బోరు మోటార్ మరమ్మతు.. తాగునీటి సమస్యకు పరిష్కారం



కోదాడ, నేటిధాత్రి: గుడిబండ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సర్పంచ్ మందుల నాగయ్య పాడైన బోరు మోటారును వెంటనే మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామంలో నీటి సరఫరా పునరుద్ధరించబడగా, ప్రజలు ఊరట వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## వార్డు--1లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



జహీరాబాద్, నేటిధాత్రి: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు నంబర్--1లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని తెలిపారు. నాణ్యతతో పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రభాకర్, డీఈ మహేష్, ఏఈ వెంకటేష్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ రంగా అరుణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## సింగరేణికి బొగ్గు బ్లాక్ కేటాయింపుపై బీఎంఎస్ హర్షం



శ్రీరాంపూర్, నేటిధాత్రి: మణుగూరు పీకే ఓసీ--II డీప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం బీఎంఎస్ పోరాట ఫలితమేనని ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య అన్నారు. ఈ నిర్ణయానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బొగ్గు బ్లాక్ కేటాయింపుతో సింగరేణికి దీర్ఘకాలికంగా ఉత్పత్తి, కార్మికులకు ఉద్యోగ భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించేలా బీఎంఎస్ కృషి కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

## 'భావన డయా బెస్ట్ రైస్' కేంద్రం ప్రారంభం



కుత్బుల్లాపూర్, నేటిధాత్రి: గాజులరామారం డివిజన్ పరిధిలోని మల్లారెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన 'భావన డయా బెస్ట్ రైస్' కేంద్రాన్ని ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయని, మధుమేహ నియంత్రణలో ఈ బియ్యం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ సుధీర్, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

### ఎమ్మెల్యే జీఎస్ఆర్



భూపాలపల్లి, నేటిధాత్రి: టేకుమట్ల మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులందరికీ చేరేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## సేవ్ ఎనర్జీ--సేవ్ ఫ్యూయల్' సైకిల్ ర్యాలీ



పరకాల, నేటిధాత్రి: పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు చైతన్య మోడల్ హైస్కూల్ ఎన్సీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'సేవ్ ఎనర్జీ--సేవ్ ఫ్యూయల్, సైకిల్ తొక్కండి--ఆరోగ్యంగా ఉండండి' నినాదాలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎన్సీసీ క్యాడెట్లు పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు ఇంధన పొదుపు, కాలుష్య నియంత్రణ, సైకిల్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ యుగేందర్, ఎన్సీసీ సీఓ ఫరాహ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హరీశ్‌రావుపై ఆరోపణలు ఖండిస్తున్నాం నరోత్తం



జహీరాబాద్, నేటిధాత్రి: మాజీ మంత్రి టి. హరీశ్‌రావుపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం అన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. హరీశ్‌రావుపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శంకర్, చంద్రశేఖర్ రెడ్డి, శివకుమార్, గోపాల్, విష్ణువర్ధన్ రెడ్డి, ఎండీ సలీమ్, బాల్‌రాజ్, కీరు తదితరులు పాల్గొన్నారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

**సంప్రదించవలసిన చిరునామా..**

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# ఉదయనిధి బరితెగింపు విమర్శలు!

హైదరాబాద్, నేటిధాత్రి:
అధికారంలో ఉంటే పెసరం మాటలు.. రెచ్చగొట్టే ప్రసంగాలు.. సనాతన ధర్మంపై అవాకులు చెవాకులు పేలడం వంటివన్నీ చూశాం. డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ నేపథ్యం ఇది. ఏది పడితే అది మాట్లాడిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. డిప్యూటీ సీఎంగా అధికారం వెలగబెడుతూనే సనాతన ధర్మంపై నోరు పారేసుకున్నాడు. ఇలాంటి వారికి నటుడు ప్రకాశ్ రాజ్ లాంటి వారు చెంచాలుగా ఉన్నారు.

తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తమిళనాట రచ్చరేపాయి. త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యలకు అరెస్టయి, కోర్టు తీర్పుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా తన పెడసరం మాటలను తగ్గించుకుంటానని అనడం లేదు. డిప్యూటీ సీఎంగా పనిచేసిన వ్యక్తి కొంత సంయమనంగా ఉండాలి. అంత మాత్రాన నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తానంటే కుదరదు. తాత కరుణానిధి, తండ్రి స్టాలిన్ సంపాదించిన పొలిటికల్ క్రెడిబిలిటీని వివాదాస్పద వ్యాఖ్యలతో మంటగలిపేయడం లక్ష్యంగా ఉదయనిధి రాజకీయాలు సాగుతున్నాయి.

తమిళనాడు రాజకీయ చరిత్రలో నాయకుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణం. అయితే రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం ఆందోళన కలిగించే విషయం. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన ఇమేజ్‌ను దిగజార్చే అవకాశాలున్నాయి. శశికళ నుంచి నేటి త్రిష కామెంట్స్ వరకు ఆయన వ్యవహార శైలి రాజకీయాల్లో నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

నిరసనల్లో పొలిటికల్ పాయింట్లు మాట్లాడకుండా వ్యక్తిగత దాడులకు దిగడం సరైన పద్ధతి కాదన్నది అందరూ ముక్తకంఠంతో విమర్శించారు. ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో డీఎంకే పార్టీకి ఎలాంటి రాజకీయ మూల్యాన్ని చెల్లించేలా చేస్తాయో వేచి చూడాలి. అయితే రాజకీయాల్లో విమర్శలు సహజమే.. కానీ వ్యక్తిగత స్థాయికి దిగజారి మహిళలపై నోరు పారేసుకోవడం ఉదయనిధి స్టాలిన్ వంటి నేతలకు మాత్రమే సాధ్యమని రుజువు చేసుకున్నారు.

నటి త్రిషపై ఆయన చేసిన వ్యాఖ్యలతో తమిళనాడు ఒక్కసారిగా భగ్గుమంది. అయితే ఇలాంటి మాటలు మాట్లాడటం ఆయనకు కొత్తేమీ కాదు. సనాతన ధర్మంపై ఆ మధ్య నోరు పారేసుకున్న ఉదయనిధి స్టాలిన్, గతంలోనూ నోటికి ఎంతొస్తే అంత మాట్లాడేవారు. తంజావూరులో కావేరి నీటి పంపకాల అంశంపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన సందర్భంగా ప్రభుత్వ తీరును,



ముఖ్యమంత్రి విజయ్‌ను తీవ్రంగా విమర్శించారు.

ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి డీఎంకేపై రాజకీయ కక్షసాధింపులకు విజయ్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఉదయనిధి ప్రసంగిస్తున్న సమయంలో డీఎంకే కార్యకర్తలు నటి త్రిష పేరును నినాదాలుగా చేయడం ప్రారంభించారు. దానికి స్పందించిన ఉదయనిధి "మన ప్రాంతానికి నీళ్లు రాకపోయినా పర్లేదు.. అక్కడ నీళ్లు చేరాలనేది ఆయన ఆలోచన" అని డబుల్ మీనింగ్ వచ్చేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సహా పలువురు రాజకీయ నాయకులు దీనిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నీచమైన మాటలతో మహిళలను కించపరిచారని విమర్శిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ మహిళలను, ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఆయన ఎమ్మెల్యే కాకముందు నుంచి కూడా వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు.

2021 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి పళనిస్వామిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శశికళ కాళ్లను పట్టుకోవడానికి పళనిస్వామి శవంలా పాకారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అన్నాడీఎంకే నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనపై పరువునష్టం (డిఫమేషన్) కేసు కూడా నమోదు చేశారు. మహిళా నాయకులను, రాజకీయ ప్రత్యర్థులను దిగజార్చేలా మాట్లాడటం ఆయన శైలిగా మారిందనే విమర్శలు వచ్చాయి.

విజయ్ నేతృత్వంలోని టీవీకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయనిధి తన వ్యాఖ్యల జోరు తగ్గించలేదు. దీనికితోడు అధికారం కోల్పోవడంతో తట్టుకోలేకపోతున్నాడు. మీడియా సమావేశంలో, తన ఎక్స్ ఖాతా పోస్టు ద్వారా ముఖ్యమంత్రి విజయ్‌ను సూటిగా లక్ష్యంగా చేసుకున్నారు. అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగించేలా "కుట్టి స్టోరీ" చెప్పడం తగదని వ్యాఖ్యానించారు.

చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ తమిళనాడు అంతటికీ తెలుసంటూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య ఉన్న వివాదాలను ఈ రకంగా ప్రస్తావించడంపై టీవీకే శ్రేణులు భగ్గుమన్నాయి. మరో సందర్భంలో మాట్లాడిన ఉదయనిధి.. త్వరలోనే టీవీకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటమ్ పాటలకు డాన్సులు చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.

డీఎంకే అధినేత స్టాలిన్ తన కుమారుడిని కంట్రోల్ చేసుకోవాల్సిందే. లేకుంటే ఈ విపరీతాలు ఎంతకైనా దారితీస్తాయి. విమర్శలకు అలవాటు పడ్డ ఉదయనిధి ఇకముందు వివాదాలు సృష్టించేలా మాట్లాడకుండా ఉండలేడు. అందువల్ల డీఎంకే అధినేత స్టాలిన్ ఆయనను అదుపులో పెట్టుకోకుంటే మూల్యం చెల్లించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## అవసరమైతే వందసార్లయినా అరెస్ట్ అవుతా

### ఎవరి బెదిరింపులకు లొంగేది లేదు: ఉదయనిధి

చెన్నై, నేటిధాత్రి:
సినీ నటి త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యల వివాదంలో అరెస్టయి, విడుదలైన డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విడుదల అనంతరం తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్ చేసిన ఆయన.. రాజకీయ ఒత్తిళ్లకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. "నేను కలైంజర్ మనవడిని.. ఎంకే స్టాలిన్ కుమారుడిని.. డీఎంకే కార్యకర్తను. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు. రైతుల కోసం పోరాడే క్రమంలో ఒక్కసారి కాదు.. అవసరమైతే వందసార్లు అరెస్ట్ అయ్యేందుకైనా సిద్ధమే. ప్రజాసేవను ఎలాంటి అణచివేత ఆపలేదు" అని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పోస్టులో



రాసుకొచ్చారు. అంతకుముందు.. త్రిషా కృష్ణన్‌పై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. దీంతో మంగళవారం (ఈనెల 4న) పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. తంజావూరులో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి అసత్య ప్రచారం చేశారని, తప్పుడు కేసులు బనాయించి రాజకీయంగా వేధించేందుకు యత్నించారన్నారు. అరెస్ట్ చేసిన సమయంలో తానేమాత్రం భయపడలేదని, మీడియా ఎదుట ఈ చర్యను హాస్యాస్పదంగా భావిస్తున్నానని చెప్పి మరీ పోలీసులతో వెళ్లానని తెలిపారు. తానెప్పుడూ పారిపోలేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోనని చెప్పుకొచ్చారు ఉదయనిధి.

అలాగే గతంలో కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ.. అధికార పక్షంపై ఉదయనిధి విమర్శలకు దిగారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తన అరెస్ట్‌ను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్ష, ఇతర రాజకీయ పార్టీల నేతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## గ్రామీణులకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

- ఆరోగ్య శిబిరాలతో వ్యాధులను ముందుగానే గుర్తించవచ్చు: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- వర్ధన్నపేటలో లయన్స్ క్లబ్ మెగా హెల్త్ క్యాంపు ప్రారంభం

వర్ధన్నపేట, నేటిధాత్రి:
గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప సామాజిక సేవ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. సహృదయ సేవా ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ ట్రైసిటీ ఆధ్వర్యంలో వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన మెగా ఆరోగ్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోమత లేని గ్రామీణ పేదలకు ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. వైద్య పరీక్షలతో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించే అవకాశం లభిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రజలకు లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమైన కార్యక్రమమని కొనియాడారు.

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణలో సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ ట్రైసిటీ ప్రతినిధులు, సహృదయ సేవా ట్రస్ట్ నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం గ్రామ ప్రజలతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్వయంగా కంటి, రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య పరీక్షలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు మందులు పంపిణీ



చేయడంతో పాటు రక్తదానం చేసిన యువకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ శిబిరంలో సాధారణ వైద్యం, కంటి పరీక్షలు, రక్తపరీక్షలు, ఆరోగ్య సలహాలు, అవసరమైన మందుల పంపిణీ ఉచితంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ ట్రైసిటీ అధ్యక్షుడు మహ్మద్ మహబూబ్ అలీ (చోటు), మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల బ్లాక్ మాజీ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు అరుణ, మండల మహిళా బ్లాక్ అధ్యక్షురాలు సునీత, మండల యువజన అధ్యక్షుడు భాను ప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ రవీందర్, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు సతీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మైనారిటీ మహిళ కార్యకర్త ఇంట తేనీటి విందులో డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్

**కీర్తినగర్ కాలనీలో ఆత్మీయ సమావేశం.. శాలువాతో ఘన సత్కారం**



వరంగల్, నేటిధాత్రి:
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) 15వ డివిజన్ పరిధిలోని కీర్తినగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ మహిళ కార్యకర్త మహమ్మద్ నూర్జహాన్ ఆహ్వానం మేరకు ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన తేనీటి విందు కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహమ్మద్ నూర్జహాన్, ఆమె కుటుంబ సభ్యులు డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌కు ఘన స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం నూర్జహాన్ శాలువాతో ఆయనను సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా స్థానిక కార్యకర్తలు, కాలనీవాసులతో మహమ్మద్ అయూబ్ ఆప్యాయంగా ముచ్చటించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మైనారిటీ మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరగడం అభినందనీయమని, పార్టీ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం ఉంటుందని ఆయన అన్నారు.

తేనీటి విందు సందర్భంగా స్థానిక సమస్యలు, కాలనీ అభివృద్ధి, ప్రజా సంక్షేమ అంశాలపై కూడా చర్చించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మహమ్మద్ అయూబ్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గోదాసి చిన్న, ఎలగొండ ప్రవీణ్, ఎస్సీ సెల్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

-కట్ర్యాలలో నునుక వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



వర్ధన్నపేట, నేటిధాత్రి:
వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి చెందిన నునుక వెంకటయ్య ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడు నునుక వెంకటయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే, అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఆయన, కష్టకాలంలో తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మృతుడి కుటుంబం ఎదుర్కొంటున్న బాధను పంచుకుంటూ వారికి మనోధైర్యం కల్పించారు. ప్రజా ప్రతినిధులుగా ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వాములు కావడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల బ్లాక్ మాజీ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు అరుణ, మండల మహిళా బ్లాక్ అధ్యక్షురాలు సునీత, మండల యువజన అధ్యక్షుడు భాను ప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ రవీందర్, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు సతీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురం మార్కెట్‌లో పారిశుద్ధ్యానికి కమిషనర్ వెంకన్న ఆదేశాలు

**చెత్త తరలింపు, ఫాగింగ్, డ్రైనేజీ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు – ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం**



- లక్ష్మీపురం మార్కెట్‌లో పారిశుద్ధ్యంపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ
- చెత్తను సకాలంలో తరలించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహణ
- డ్రైనేజీల శుభ్రతతో వర్షాకాల సమస్యలకు ముందస్తు చర్యలు
- నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ పరిశీలన

వరంగల్, నేటిధాత్రి:
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలోని మార్కెట్లలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేసి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.

బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంకతో కలిసి లక్ష్మీపురం మార్కెట్‌ను సందర్శించిన కమిషనర్, అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులు, మౌలిక వసతులను పరిశీలించారు. మార్కెట్‌లో ప్రతిరోజూ పేరుకుపోతున్న ఘన వ్యర్థాలను ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో తరలించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాంపూర్ డంపింగ్ యార్డుకు చెత్త తరలింపులో జాప్యం జరుగుతున్నందున, ముందుగా బాలసముద్రం ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి శాస్త్రీయ పద్ధతిలో డంపింగ్ యార్డుకు పంపించే విధంగా కార్యాచరణ రూపొందించాలని పారిశుద్ధ్య అధికారులను ఆదేశించారు.

### దోమల నివారణకు ఫాగింగ్ తప్పనిసరి

మార్కెట్ పరిసరాల్లో అపరిశుభ్ర పరిస్థితులు తలెత్తకుండా ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేపట్టాలని



సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మార్కెట్‌లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.

### డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జీడబ్ల్యూఎంసీ పరిధిలోని ప్రధాన మురుగు కాలువలు, డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేస్తూ నీటి నిల్వలు, మురుగు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### ఇంటిగ్రేటెడ్ వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ పరిశీలన

అనంతరం నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్-నాన్‌వెజ్ మార్కెట్‌ను కమిషనర్ పరిశీలించారు. వ్యాపారులు, వినియోగదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సీహెచ్‌వో లక్ష్మారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్‌బాబు, ఇతర అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కట్ట మల్లన్న స్వామి దేవాలయ అభివృద్ధికి రూ. 70 లక్షలు

- కమ్యూనిటీ హాల్, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి శంకుస్థాపన
- మాజీ మేయర్ గుండు సుధారాణి, డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌తో కలిసి ప్రారంభం



- కమ్యూనిటీ హాల్, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా పనుల ప్రారంభం
- మాజీ మేయర్ గుండు సుధారాణి, డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పాల్గొనడం
- పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకుల హాజరు



వరంగల్, నేటిధాత్రి:
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) 15వ డివిజన్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కట్ట మల్లన్న స్వామి దేవాలయం అభివృద్ధి పనులకు రూ.70 లక్షల నిధులతో బుధవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ నిధులతో దేవాలయ ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పనులను చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల విస్తరణ అవసరమని ఆయన పేర్కొన్నారు.

శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధి అనేది కేవలం నిర్మాణాలకే పరిమితం కాదని, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని అన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం ద్వారా స్థానిక ప్రజలు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను సౌకర్యవంతంగా నిర్వహించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అలాగే ప్రహరీ గోడ నిర్మాణంతో ఆలయ భద్రత మరింత బలోపేతం అవుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పాల్గొని ఆలయ అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు కందుగుల అశోక్, దేవాలయ చైర్మన్ చక్రపాణి, గోదాసి చిన్న, ఎలగొండ ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, భక్తులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభివృద్ధి పనుల ప్రారంభాన్ని స్వాగతించారు.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999